ఘనంగా విద్యుత్ శాఖ వారోత్సవాలు

జిల్లావ్యాప్తంగా అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఖలీల్‌వాడి, జూలై 1 : విద్యుత్ శాఖ వారోత్సవాలను సంబంధిత అధికారులు జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామాల్లో పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఎలక్ట్రికల్ వర్క్ లైసెన్స్ కాంట్రాక్టర్‌తోనే విద్యుత్ పనులు చేయించాలని సూచించారు. ఐఎస్ఐ మార్క్ ఉన్న ఎలక్ట్రికల్ వైర్లు, స్విచ్ గేర్, ఎక్విప్‌మెంట్ వస్తువులను వినియోగించాలన్నారు. ఐదేండ్లకోసారి వైర్లను సరిచూసుకోవాలని అన్నారు. విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా, వానకాలంలో విద్యుత్ పరికరాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దవాఖానలు, పెట్రోల్ బంకుల వద్ద వినియోగించాల్సిన పరికరాలు, వస్తువులపై అవగాహన కల్పించారు.

విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలి

విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యుత్ వారోత్సవాల సందర్భంగా అవగాహన కల్పిస్తున్నాం. వానకాలంలో ఎలక్ట్రికల్ పరికరాలతో జాగ్రత్తగా ఉండాలి. స్తంభాలు, వైర్లను ముట్టవద్దు. ఇనుప తీగలపై బట్టలు ఆరేయవద్దు

–రాజు, డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్

'ప్రజావాణి'కి పోటెత్తిన ఫిర్యాదులు

వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు

కంఠేశ్వర్, జూలై 1 : నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 130 ఫిర్యాదులు అందాయని అధికారులు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతులోపాటు అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, డీఆర్డీవో సాయాగౌడ్, డీపీవో తరుణ్ చక్రవర్తికి విన్నవిస్తూ అర్జీలను సమర్పించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు

రెవెన్యూ సిబ్బందిపై కలెక్టర్ సీరియస్

సారంగాపూర్, జూలై 1 : నగర శివారులోని డెయిరీ ఫారం వద్ద 249 సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్నదని బీఆర్ఎస్ నాయకుడు అక్బర్ నవాజుద్దీన్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కబ్జా భూమి గురించి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని తెలుపడంతో కలెక్టర్.. నార్త్ మండల రెవెన్యూ అధికారులపై సీరియస్ అయ్యారు. కబ్జాకు గురైన భూమికి వెంటనే సర్వే చేసి, నివేదిక సమర్పించాలని కలెక్టర్ తహసీల్దార్‌ను ఆదేశించారు. తహసీల్దార్ సూచనల మేరకు మండల సర్వేయర్ సయ్యద్, గిర్దావర్ ప్రభాకర్ ఆ భూమిని పరిశీలించి కొలతలు చేపట్టారు. ఆ భూమిలో కొనసాగుతున్న ఇండ్ల నిర్మాణాలను కూడా పరిశీలించారు. నివేదికను అధికారులకు అందజేస్తామని గిర్దావర్ తెలిపారు.

పాముకాటుతో గిరిజన మహిళ మృతి

జనవ్వ (ఫైల్)

లింగంపేట, జూలై 1: మండలంలోని కన్నాపూర్ తండాకు చెందిన నునావత్ జనవ్వ (41) పాము కాటుతో మృతి చెందినట్లు తండావాసులు సోమవారం తెలిపారు. జనవ్వ ఆదివారం రాత్రి భోజనం చేసి నిద్రిస్తుండగా.. నల్లత్రాచు పాము కాటు వేసినట్లు పేర్కొన్నారు.. పాము కాటు వేసిన విషయాన్ని గుర్తించిన జనవ్వ.. కుటుంబ సభ్యులకు తెలుపగా వారు ఆమెను వెంటనే కామారెడ్డిలోని దవాఖానకు తరలించినట్లు తెలిపారు. అక్కడ జనవ్వ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తండావాసులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

కొడుకును హత్య చేసిన కేసులో తండ్రి అరెస్టు

ఎల్లారెడ్డి రూరల్, జూలై 1: కొడుకును హత్యచేసిన కేసులో తండ్రిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను పోలీసు స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మండలంలోని గండిమాసానిపేట్‌కు చెందిన వెంకటేశ్‌ను ఆయన కొడుకు సాయిలు కొంతకాలంగా వ్యవసాయభూమిని పంచాలంటూ అడుగుతూ వస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి మద్యం మైకంలో ఇంటి ముందు ఉన్న ఇసుకలో నిద్రపోయిన కొడుకు సాయిలు తలపై తండ్రి వెంకటేశ్ కర్రతో గట్టిగా కొట్టి హతమార్చాడు. అనంతరం తువ్వాలతో సాయిలు మృతదేహాన్ని లాక్కెళ్లి పోచారం కాలువ వద్ద పడేశాడు. కేసు నమోదు చేసుకొని వెంకటేశ్‌ను విచారించగా.. తన కొడుకును హత్య చేసినట్లు ఒప్పుకున్నాడని సీఐ పేర్కొన్నారు. హత్యకు ఉపయోగించిన కర్రతో పాటు తువ్వాలను స్వాధీనంచేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై హత్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. కోర్టులో హాజరుపరిచినట్లు ఆయన చెప్పారు.

చోరీకి యత్నించిన కేసులో ఇద్దరికి ఏడాది జైలుశిక్ష

వినాయక్‌నగర్, జూలై 1 : దొంగతనానికి యత్నించిన కేసులో ఇద్దరు నిందితులకు ఏడాది చొప్పున జైలుశిక్ష విధిస్తూ నిజామాబాద్ ప్రత్యేక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ చైతన్య సోమవారం తీర్పు చెప్పారని త్రీటౌన్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాకేంద్రంలోని గౌతంనగర్‌కు చెందిన సంగరి చందు, సంభవాని కిరణ్ గతేడాది చోరీకి యత్నించడంతో వారిపై మూడో టౌన్‌లో కేసు నమోదైనట్లు వెల్లడించారు. సోమవారం ఆరోపణలు రుజువు కావడంతో ఇద్దరికి ఏడాది చొప్పున జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు పేర్కొన్నారు.

వాహనాలకు నంబర్లు కనిపించేలా ఉండాలి

ఎల్లారెడ్డి రూరల్, జూలై 1: ద్విచక్రవాహనాలకు నంబర్లు కనిపించే విధంగా నంబర్‌ప్లేట్లు ఉంచుకోవాలని ఏఎస్సై విజయలక్ష్మి సూచించారు. సోమవారం ఎల్లారెడ్డి పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసులతో కలిసి ఆమె వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలకు సరైన నంబర్‌ప్లేట్లు , ధ్రువపత్రాలు లేకున్నా, తాగి వాహనాలు నడిపినా వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.తనిఖీల్లో కానిస్టేబుళ్లు ప్రేమ్‌సింగ్, మధుకర్, ఆంజనేయులు తదితరులున్నారు.

జిల్లాకేంద్రంలోని వినాయక్‌నగర్ – బస్వాగార్డెన్ దారిలో సోమవారం మధ్యాహ్నం భారీ చెట్టు నేలకొరిగింది. రోడ్డుపై చెట్టు పడడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాం కలిగింది. ఈదురుగాలులు, వర్షాలకు చెట్లు నేలకొరుగుతున్నాయని, భారీ వృక్షాలను గుర్తించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– కంఠేశ్వర్, జూలై 1

బాన్సువాడలో గంజాయి విక్రయం

ముగ్గురు నిందితుల రిమాండ్

బాన్సువాడ, జూలై 1: బాన్సువాడలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో ఓ వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు పట్టణ సీఐ మున్నూరు కృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు కొయ్యగుట్ట ప్రాంతంలో సీమల శ్రీకాంత్ అనే యువకుడిని అదుపులోకి తీసుకొన్నారు. యువకుడిని తనిఖీ చేయగా అతడి వద్ద 120 గ్రాముల గంజాయి లభ్యం కావడంతో పూర్తిస్థాయిలో విచారించారు. విచారణలో బోధన్ పట్టణంలోని రాకాసీపేట్‌కు చెందిన నస్రీన్ బేగం అలియాస్ సుమేర భాను అనే మహిళ వద్ద తాను గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపాడు. దీంతో బాన్సువాడ పోలీసులు వెంటనే బోధన్‌కు వెళ్లి నస్రీన్‌బేగం ఇంట్లో తనిఖీ చేయగా ఆమె వద్ద 500 గ్రాములు గంజాయి లభ్యమైనట్లు డీఎస్పీ తెలిపారు. ఆమెతో పాటు ఆమె మామ ఎండీ రషీద్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా మహారాష్ట్రలోని నాయిగావ్ అనే ప్రాంతం నుంచి గంజాయి కొనుగోలు చేసి తీసుకువచ్చినట్లు రషీద్ ఒప్పుకున్నాడని తెలిపారు. దీంతో నస్రీన్‌బేగం, శ్రీకాంత్, రషీద్‌ను కోర్టులో హాజరుపర్చినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. నిందితులను పట్టుకున్న పట్టణ సీఐ కృష్ణ, పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ముగ్గురు యువకుల ఆత్మహత్య

వేర్వేరు ప్రాంతాల్లో ఘటనలు

మోస్రా (చందూర్) / వినాయక్‌నగర్, జూలై 1 : ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన వేర్వేరు ప్రాంతాలకు చెందిన ముగ్గురు యువకులు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. మోస్రా మండలం గోవూర్‌కు చెందిన ఈప్తి పోశెట్టి (24) ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొ ని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్ ఏరియాలో అద్దె ఇంట్లో నివాసముంటున్న కమ్మర్‌పల్లి మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన రమావత్ శేఖర్(19) గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ప్రవీణ్ కుమార్ కథనం ప్రకారం.. శేఖర్ తన స్నేహితుడితో కలిసి జిల్లాకేంద్రంలో నివాసముంటున్నాడు. లోన్ తీసుకునేందుకు రూ. 2 లక్షలు అవసరముందని శేఖర్ తన తండ్రికి చెప్పగా డబ్బులు పంపాడు. ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందిన శేఖర్ ఆదివారం గడ్డి మందు తాగాడు. తోటి స్నేహితుడు ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. సోమవారం మృతిచెందాడు. తన కుమారుడి చావుపై ఎలాంటి అనుమానాలు లేవని మృతుని తండ్రి లింబాద్రి ఫిర్యాదు చేశారని ఎస్సై తెలిపారు.

నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మారుతీనగర్‌లో ఉండే అనిరుధ్‌రెడ్డి (28) ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో ఇంట్లో సోమవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై మహేశ్ కథనం ప్రకారం.. అనిరుధ్‌రెడ్డి భార్య స్వాతి ఉద్యోగానికి వెళ్లగా.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం అమలులోకి వచ్చిన దేశ నూతన చట్టాల్లోని భారతీయ నాగరిక సురక్ష సంహిత చట్టం ప్రకారం కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై మహేశ్ తెలిపారు.

నేటి నుంచి దోస్త్ ఆన్‌లైన్ ప్రత్యేక కేటగిరీ ధ్రువపత్రాల పరిశీలన

డిచ్‌పల్లి, జూలై 1 : దోస్త్ ఆన్‌లైన్‌లో భాగంగా డిగ్రీ ప్రవేశాలకు 2024-25 సంవత్సరానికి రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరీ విద్యార్థులకు నేడు (మంగళవారం)ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని దోస్త్ కో- ఆర్డినేటర్ సంపత్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీయూలోని అకడమిక్ ఆడిట్ సెల్‌లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరిశీలన చేపడతామని పేర్కొన్నారు. పీహెచ్‌సీ (దివ్యాంగులు), సీఏపీ/ఎన్‌సీసీ/ఎక్స్‌ట్రా కరిక్యూలర్ యాక్టివిటీస్ విద్యార్థుల ధ్రువపత్రాలను మాత్రమే పరిశీలించనున్నట్లు స్పష్టం చేశారు.

బైక్ దొంగ అరెస్ట్-రిమాండ్‌కు తరలింపు

ఎల్లారెడ్డి రూరల్, జూలై 1: బైక్ దొంగను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేశ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులకు వివరాలను వెల్లడించారు. ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన డాక్టర్ నాగేశ్వర్‌రావ్ దవాఖానకు లింగంపేట్ మండలం మెంగారం గ్రామానికి చెందిన తంత్రి అశోక్ తన తమ్ముడి ట్రీట్‌మెంట్ కోసం జూన్ 17వ తేదీన రాత్రి 9గంటల సమయంలో తీసుకువచ్చాడు. దవాఖాన ఎదుట తన టీవీఎస్ వాహనాన్ని పార్క్ చేశాడు. మరుసటి రోజు ఉదయం చూసే సరికి టీవీఎస్ వాహనం కనిపించపోవడంతో ఎల్లారెడ్డి పోలీసులకు అశోక్ ఫిర్యాదు చేశారు. గత ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా అనుమానాస్పదంగా కనిపిస్తున్న నాగిరెడ్డిపేట్ మండలం తాండూర్ గ్రామానికి చెందిన కర్రోళ్ళ రాజును పట్టుకొని విచారించగా బైక్‌ను దొంగిలించినట్లు ఒప్పుకున్నట్లు ఎస్సై తెలిపారు. బండిని స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

పింఛన్లు పెంచకపోతే సీఎం ఇల్లు ముట్టడి

వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాతా సూర్యవంశీ

మాట్లాడుతున్న సుజాతా సూర్యవంశీ

శక్కర్‌నగర్, జూలై 1: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్లు పెంచకపోతే సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాతా సూర్యవంశీ హెచ్చరించారు. సోమవారం ఆమె బెల్లాల్‌లో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే దివ్యాంగులకు రూ.4 వేల నుంచి రూ.6వేలకు పింఛన్ పెంచుతామని చెప్పారని, వృద్ధులు, వితంతువులు, గీత కార్మికులు, బీడీ కార్మికులకు రూ.2వేల నుంచి రూ. 4వేలు పెంచుతామని పేర్కొన్నారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా హామీలపై ఊసెత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ప్రకటన చేయాలని కోరారు. దివ్యాంగులందరికీ రాష్ట్రంలో ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు ప్రభుత్వం రాజీవ్‌గాంధీ నేషనల్ ఫెలోషిప్ (పీహెచ్‌డీ)కు వయస్సు నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారంలో భాగంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే సమావేశానికి దివ్యాంగులు సిద్ధంగా ఉండాలని కోరారు. నాయకులు వీరప్ప, ఆకుల నారాయణతో పాటు పలువురు దివ్యాంగులు ఉన్నారు.

బీఎస్ఎన్ఎల్ రూ.249 ప్లాన్

45 రోజుల వ్యాలిడిటీ.. రోజూ 2జీబీ

టెలికం ఇండస్ట్రీలో హాట్ టాపిక్

న్యూఢిల్లీ, జూలై 1: దేశీయ ప్రభుత్వ రంగ టెలికం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) కొత్త కస్టమర్లను ఆకట్టుకోవడానికి ఓ నయా ప్లాన్‌ను పరిచయం చేసింది. దీని రేటు రూ.249 మాత్రమే. కాలవ్యవధి 45 రోజులు. అన్‌లిమిటెడ్ కాల్స్‌తో ఉన్న ఈ ఆకర్షణీయ ప్యాకేజీలో రోజూ 2జీబీ డాటా, 100 ఉచిత ఎస్ఎంఎస్‌లను వినియోగదారులు వాడుకోవచ్చు. అయితే ప్రైవేట్ రంగ టెలికం కంపెనీలు రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా.. ఇటీవలే తమ ప్లాన్ల ధరలను భారీగా పెంచుతున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో బీఎస్ఎన్ఎల్ ప్లాన్ ఇప్పుడు టెలికం ఇండస్ట్రీలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. అధిక టారిఫ్‌ల నుంచి ఉపశమనాన్ని కోరుకునే మొబైల్ యూజర్లను ఆకట్టుకునేందుకే బీఎస్ఎన్ఎల్ తక్కువ ధరకే ఎక్కువ ప్రయోజనాలున్న ఈ ప్లాన్‌ను తీసుకొచ్చిందన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. నిజానికి ఇతర టెలికం కంపెనీలు ఇదే ధర (రూ.249)కు రోజుకు 1జీబీ డాటానే ఇస్తుండగా, వ్యాలిడిటీ కూడా 28 రోజులే ఉంటుండటం గమనార్హం. దీంతో బీఎస్ఎన్ఎల్ నూతన ప్లాన్‌లో రోజువారీ డాటా రెట్టింపవడమేగాక, ప్లాన్ గడువు కూడా 17 రోజులు పెరుగుతున్నది. ప్రస్తుత పరిస్థితుల్లో మొబైల్ వినియోగదారులకు ఇది గొప్ప ఊరటగానే చెప్పుకోవచ్చు. ఇదిలావుంటే బుధవారం నుంచి జియో, ఎయిర్‌టెల్.. గురువారం నుంచి వొడాఫోన్ ఐడియా తమ ప్లాన్ల ధరలను దాదాపు 26 శాతం మేర పెంచుతున్నాయి. దీంతో ఒక్కో వినియోగదారునిపై గరిష్ఠంగా రూ.600 భారం పడబోతున్నది.

అంతర్జాతీయ పేమెంట్స్ కోసం..

వివిధ ఆసియా దేశాలతో కలిసి వెళ్తున్న ఆర్బీఐ

ముంబై, జూలై 1: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ).. మలేషియా, సింగపూర్ సహా నాలుగు ఆసియా దేశాలు కలిసి వేగవంతమైన రిటైల్ పేమెంట్స్ కోసం ఓ వేదికను ఏర్పాటు చేయాలని నిర్ణయించాయి. 2026లో ఇది అందుబాటులోకి రావచ్చన్న అంచనాలున్నాయి. దేశీయ ఫాస్ట్ పేమెంట్స్ సిస్టమ్స్ (ఎఫ్‌పీఎస్) ఇంటర్‌లింకింగ్ ద్వారా ఓ ఇన్‌స్టంట్ క్రాస్-బార్డర్ రిటైల్ పేమెంట్స్ ప్లాట్‌ఫామ్ అభివృద్ధికి బహుళజాతి ఆలోచన ప్రాజెక్ట్ అయిన నెక్స్‌స్‌లో భాగస్వామ్యమైనట్టు ఆర్బీఐ ఓ ప్రకటనలో తెలిపింది. బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్మెంట్స్ (బీఐఎస్) ఇన్నోవేషన్ హబ్ కాన్సెప్టే ఈ నెక్స్‌స్. దీని ద్వారా తొలుత భారత్, మలేషియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయిలాండ్ దేశాల ఎఫ్‌పీఎస్‌ల అనుసంధానం జరుగుతుందని ఆర్బీఐ వివరించింది. ఈ మేరకు జరిగిన ఒప్పందంపై స్విట్జర్లాండ్‌లోని బాసెల్‌లో ఆర్బీఐతోపాటు ఆయా దేశాల సెంట్రల్ బ్యాంకులు, బీఐఎస్ సంతకాలు చేశాయి. మున్ముందు మరిన్ని దేశాలు ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతాయని ఆర్బీఐ చెప్పింది.

పూర్తిగా రాని రూ.2వేల నోట్లు

రూ.2వేల నోట్లు పూర్తిగా తిరిగి బ్యాంకుల్లోకి రాలేదని ఆర్బీఐ సోమవారం తెలిపింది. ఇప్పటిదాకా 97.87 శాతం వచ్చినట్టు వివరించింది. ఇంకా రూ.7,581 కోట్ల విలువైన రూ.2వేల నోట్లు ప్రజల వద్దే ఉన్నాయని చెప్పింది. గత ఏడాది మే 19న రూ.2వేల నోట్లను చలామణి నుంచి ఉపసంహరిస్తున్నట్టు ఆర్బీఐ ప్రకటించిన విషయం తెలిసిందే. నాడు వీటి విలువ రూ.3.56 లక్షల కోట్లుగా ఉన్నది. అయితే జూన్ 28 నాటికి ఇది రూ.7,581 కోట్లకు పడిపోయినట్టు ఆర్బీఐ తెలిపింది. దీంతో 97.87 శాతం రూ.2వేల నోట్లు తిరిగి బ్యాంకుల్లోకి వచ్చేశాయని పేర్కొన్నది. ఈ పెద్ద నోట్ల మార్పిడికి ప్రస్తుతం హైదరాబాద్‌సహా దేశంలోని 19 ఆర్బీఐ కార్యాలయాల్లో వీలు కల్పించారు. 2016 నవంబర్‌లో రూ.1000, రూ.500 నోట్ల రద్దు నేపథ్యంలో ఈ రూ.2000 నోట్లు పరిచయమైన సంగతి విదితమే.

కొత్త ఈడీల నియామకం

ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా ఆర్నాబ్ కుమార్ చౌధరి, చారులతా ఎస్ కార్‌లను నియమించినట్టు ఆర్బీఐ వెల్లడించింది. ఈ ఇరువురూ మూడేసి శాఖలను పర్యవేక్షిస్తారని కూడా ప్రకటించింది. కార్ నియామకం సోమవారం నుంచే అమల్లోకి రాగా, చౌధరి నియామకం మాత్రం జూన్ 3 నుంచే వర్తిస్తుంది.

బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో గోల్డెన్ పీకాక్ అవార్డును అందుకుంటున్న ఎల్ అండ్ టీ మెట్రో ఎండీ, సీఈవో కేవీబీ రెడ్డి

ఉన్నత శిఖరాలకు సూచీలు

సెన్సెక్స్ 443, నిఫ్టీ 131 పాయింట్ల వృద్ధి

ముంబై, జూలై 1: దేశీయ స్టాక్ మార్కెట్ల రికార్డుల పరంపర కొనసాగుతున్నది. బ్యాంకింగ్, ఐటీ రంగ షేర్ల నుంచి లభించిన మద్దతుతో సూచీలు మరో ఉన్నత శిఖరానికి చేరుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లు ముఖ్యంగా ఆసియా, యూరోపియన్ సూచీలు లాభాల్లో మునిగియడంతో దేశీయ మదుపరుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఒక దశలో 500 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 443.46 పాయింట్లు అందుకొని ఆల్-టైం హైకి 79,476.19 పాయింట్లకు చేరుకున్నది. 30 షేర్ల ఇండెక్స్‌లో 20 షేర్లు లాభపడగా, 10 షేర్లు నష్టాల్లోకి జారుకున్నాయి. మరో సూచీ నిఫ్టీ 24 వేల పాయింట్ల పైన ముగిసింది. 131.35 పాయింట్లు అందుకొని 24,141.95 వద్ద స్థిరపడింది. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల విలువ రూ.4,43,05,344.036 కోట్లకు చేరుకున్నది.

- టెక్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌యూఎల్, టీసీఎస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టాటా మోటర్స్, ఐసీఐసీఐ బ్యాంక్‌లు షేర్లు లాభాల్లో ముగిశాయి.
- ఎన్‌టీపీసీ, ఎస్బీఐ, లార్సెన్ అండ్ టుబ్రో, సన్‌ఫార్మా, ఇండస్‌ఇండ్, యాక్సిస్ బ్యాంక్‌లు నష్టాల్లోకి జారుకున్నాయి.
- ఐటీ అత్యధికంగా 1.84 శాతం లాభపడగా.. టెక్ 1.46 శాతం, కమోడిటీస్ 1.21 శాతం, టెలికమ్యూనికేషన్ 1.03 శాతం, మెటల్ రంగ సూచీలకు మదుపరుల నుంచి మద్దతు లభించింది.

యంగ్‌వన్‌లో దుస్తుల తయారీ!

కంపెనీ చైర్మన్ కిహాక్ సంగ్ వెల్లడి

గీసుగొండ, జూలై 1: వరంగల్ జిల్లాలో టెక్స్‌టైల్ పార్క్‌లో ఏర్పాటు చేసిన ప్లాంట్లో త్వరలో దుస్తుల తయారీని ప్రారంభించనున్నట్లు యంగ్‌వన్ కంపెనీ చైర్మన్ కిహాక్ సంగ్ తెలిపారు. ప్లాంట్ కోసం కేసీఆర్ ప్రభుత్వం 297 ఎకరాల భూమి కేటాయించినట్లు, పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి గత ప్రభుత్వమే అన్ని రకాల అనుమతులు మంజూరు చేసిందన్నారు. వెయ్యి కోట్లతో నిర్మిస్తున్న ఈ ప్లాంట్ పనులు చివరి దశకు చేరుకున్నాయని, తద్వారా 11 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. ఈ యూనిట్‌లో స్పోర్ట్స్, డ్రెస్ మెటీరియల్స్, జర్కిన్స్, సూట్స్ తదితర దుస్తులు తయారుకానున్నాయి. అలాగే శిక్షణ కేంద్రంలో కుట్టు శిక్షణ తీసుకుంటున్న మహిళల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఎన్‌సీసీకి 335 కోట్ల ఆర్డర్

హైదరాబాద్, జూలై 1: రాష్ట్రానికి చెందిన ప్రముఖ సంస్థ ఎన్‌సీసీ లిమిటెడ్ ఆర్డర్లు ఆకట్టుకోవడంలో దూసుకుపోతున్నది. గడిచిన నెలలో రూ. 335 కోట్ల విలువైన ఆర్డర్లు వచ్చాయని సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. ఈ ఆర్డర్లు బిల్డింగ్ డివిజన్ నుంచి వచ్చాయని తెలిపింది. వీటిలో అంతర్జాతీయ ఆర్డర్లు లేవని పేర్కొంది.

పతంజలి ఫుడ్స్ చేతికి పీఏఎల్ పర్సనల్ కేర్

డీల్ విలువ రూ.1,100 కోట్లు

న్యూఢిల్లీ, జూలై 1: యోగా గురువు బాబా రాందేవ్ నేతృత్వంలోని పతంజలి ఆయుర్వేద్ లిమిటెడ్ (పీఏఎల్)కు చెందిన హోం, పర్సనల్ కేర్ వ్యాపారాన్ని తమ సొంతం చేసుకున్నట్టు పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సోమవారం ప్రకటించింది. ఈ అంతర్గత లావాదేవీ విలువ రూ.1,100 కోట్లుగా పేర్కొన్నది. ఐదు విడుతల్లో ఈ చెల్లింపులు జరుగుతాయి. కంపెనీ వాటాదారులు, రుణదాతల ఆమోదానికి లోబడి ఈ లావాదేవీ ఉంటుంది. అలాగే దీనికి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆమోదం రావాల్సి ఉన్నది. ప్రధాన ఎఫ్ఎంసీజీ కంపెనీగా ఎదగడానికే ఈ డీల్‌కు దిగినట్టు దేశీయ వంటనూనెల తయారీ దిగ్గజ సంస్థల్లో ఒకటిగా ఉన్న పతంజలి ఫుడ్స్ సంస్థ తెలిపింది. కాగా, ప్రస్తుతం పతంజలి ఫుడ్స్ ప్రమోటర్లలో పీఏఎల్ కూడా ఒకటిగా ఉన్నది. ఇక ఈ డీల్‌తో హెయిర్ కేర్, స్కిన్ కేర్, డెంటల్ కేర్, హోం కేర్ వ్యాపార విభాగాలు పతంజలి ఫుడ్స్ కిందకు వస్తాయి. ఈ డీల్ ఈ ఏడాది సెప్టెంబర్ ఆఖరుకల్లా పూర్తవగలదన్న ఆశాభావాన్ని పతంజలి ఫుడ్స్ సీఈవో సంజీవ్ ఆస్తానా వ్యక్తం చేశారు.

మైక్రోసాఫ్ట్ ప్రతినిధులతో మంత్రి దుద్దిళ